భారత్‌లో... బ్యాంకింగ్ రంగం

భారత్‌లో స్వాతంత్ర్యానంతరం బ్యాంకింగ్ వ్యవస్థ బాగా పుంజుకుంది. ప్రణాళికా లక్ష్యాల సాధనకు ఊతమిచ్చింది. నూతన ఆర్థిక విధానాలు, నరసింహం కమిటీ సిఫార్సుల నేపథ్యంలో... దేశంలో వాణిజ్య బ్యాంకుల విస్తరణకు మంచి ప్రోత్సాహం లభించింది.



20వ శతాబ్దం మొదటి అర్ధభాగంలో భారతదేశంలో బ్యాంకింగ్ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంది. స్వాతంత్ర్యానంతరం మాత్రం ఊపందుకొని, మంచి పురోగతి సాధించింది. ప్రణాళికాబద్ధ ఆర్థిక వృద్ధి, ద్రవ్య సరఫరా పెరుగుదల, ప్రజల్లో బ్యాంకింగ్ వినియోగం పెరగడం, ఆర్‌బీఐ నియంత్రణ, మార్గదర్శకత్వం, బ్యాంకుల జాతీయకరణ ఈ రంగం పురోభివృద్ధికి కారణాలు. భారత ప్రభుత్వం జులై 19, 1969న బ్యాంకుల జాతీయకరణ చేసింది. 1969, జూన్‌లో కేవలం 8260 శాఖలున్న భారత బ్యాంకింగ్ రంగం... 2005 జూన్ నాటికి 68,500 శాఖలకు విస్తరించింది. గ్రామీణ ప్రాంతాల్లో 1969లో 1860 బ్యాంకు శాఖలుంటే.. 2005 జూన్ నాటికి 32,070లకు పెరిగాయి. 1969లో మొత్తం వాణిజ్య బ్యాంకుల శాఖలలో.. గ్రామీణ ప్రాంతాలలోని శాఖలు 22 శాతం కాగా... 2005లో 47 శాతానికి పెరిగాయి. 1969లో ప్రతి 63,800 మందికి ఒక బ్యాంకు శాఖ ఉండగా... 2005 జూన్ నాటికి ప్రతి 15,000 మందికి ఒక బ్యాంకు శాఖ ఉంది. 1950-51లో అన్ని షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల డిపాజిట్లు రూ. 820 కోట్ల. అవి 2006-07 నాటికి రూ.26,08,309 కోట్లకు పెరిగాయి. ఇదే కాలంలో ఈ బ్యాంకులిచ్చిన పరపతి రూ.580 కోట్ల నుంచి రూ.19,28,913 కోట్లకు పెరిగింది.

నరసింహం కమిటీ:

నూతన ఆర్థిక విధానాలకు అనుగుణంగా బ్యాంకింగ్ రంగాన్ని సన్నద్ధం చేసేందుకు.. 1991 జులైలో భారత రిజర్వు బ్యాంకు మాజీ అధ్యక్షుడు ఎం.నరసింహం అధ్యక్షతన ఒక అధ్యయన సంఘాన్ని ఏర్పాటు చేశారు. 1998లో నరసింహం అధ్యక్షతన మరో కమిటీ వేశారు. సంస్కరణల పురోగతని పరిశీలించి, దేశ విత్త వ్యవస్థను పటిష్టపరిచేందుకు సూచనలు చేయాల్సిందిగా ఈ కమిటీని ప్రభుత్వం కోరింది.

నరసింహం కమిటీ-1 (1991) సిఫార్సులు:

1) వ్యవసాయం, చిన్న తరహా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహానికిచ్చే ప్రత్యక్ష పరపతిని దశలవారీగా తొలగించాలి. ప్రత్యక్ష పరపతి విధానం తాత్కాలికంగానే ఉండాలి. ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగకూడదు.
2) నగదు నిల్వల నిష్పత్తి (CRR), Statutory Liquidity Ratio తగ్గించాలి.
3) వాణిజ్య బ్యాంకులు తమ వడ్డీ రేట్లను నిర్ణయించుకునే స్వేచ్ఛనివ్వాలి.
4) ఇకపై బ్యాంకుల జాతీయకరణ చేపట్టరాదు.
5) ప్రైవేటు రంగంలో వాణిజ్య బ్యాంకులను ప్రోత్సహించాలి.
6) వాణిజ్య బ్యాంకులు ఇచ్చే రుణంలో కొంత తమ సొంత మూలధనం అయి ఉండాలి.
7) Asset Reconstruction Fund ఏర్పాటు చేయాలి.
8) బ్యాంకింగ్ ఖాతాదార్ల ఫిర్యాదులను పరిష్కరించడానికి ఒక అంబుడ్స్‌మన్ (OMBUDSMAN) పథకాన్ని ప్రవేశ పెట్టాలి.
9) రికవరీ కాని రుణాలు వసూలు చేసేందుకు ట్రైబునల్స్‌ను ఏర్పాటు చేయాలి.
10) ప్రాధాన్యతా రంగానికిచ్చే రుణాలను 40 శాతం నుంచి 10 శాతానికి తగ్గించాలి.

నరసింహం కమిటీ - 2 సిఫార్సులు (1998):

1) బ్యాంకింగ్ వ్యవస్థకు స్వయం ప్రతిపత్తి కల్పించాలి.
2) మూడంచెల బ్యాంకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి.
3) వాణిజ్య బ్యాంకులు నిర్వహించాల్సిన Capital Adequacy Ratio (CAR) పెంచాలి.
4) వాణిజ్య బ్యాంకులలో ప్రభుత్వ లేదా ఆర్‌బీఐ వాటాను 51 శాతం నుంచి 33 శాతానికి తగ్గించాలి.
5) వాణిజ్య బ్యాంకులలో ఆర్‌బీఐ డైరక్టర్ల సంఖ్యను తగ్గించాలి.

ఎం. నరసింహం కమిటీ సిఫార్సులలో కొన్నింటిని ప్రభుత్వం అమలు చేసింది. ముఖ్యంగా ప్రాధాన్యతా రంగానికిచ్చే రుణాలను 40 శాతం నుంచి 10 శాతానికి తగ్గించాలనే నరసింహం కమిటీ సిఫార్సు వివాదాస్పదమైంది. దేశంలోని ఎక్కువమంది ప్రజల జీవనాధారమైన వ్యవసాయరంగం, చేతివృత్తులకు ఇచ్చే రుణాలను తగ్గించాలనడం విమర్శలకు గురైంది. వాణిజ్య బ్యాంకులలో ప్రభుత్వ లేదా ఆర్‌బీఐ వాటాను

తగ్గించాలన్న సిఫార్సుకు కూడా ప్రభుత్వం అంగీకరించలేదు.అయితే, కమిటీ సూచించినట్లుగానే 1991 తర్వాత బ్యాంకుల జాతీయకరణ జరగలేదు. ప్రైవేటు రంగంలో వాణిజ్య బ్యాంకులకు ప్రోత్సాహం పెరిగింది. CRR, SLR తగ్గించారు. వాణిజ్య బ్యాంకులు మార్కెట్‌కు అనుగుణంగా తమ వడ్డీ రేట్లను నిర్ణయించుకొనే స్వేచ్ఛ లభించింది. CARను 9%గా నిర్ణయించారు. ఖాతాదార్ల ఫిర్యాదులు పరిష్కరించేందుకు 1995లో ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. నిరర్ధక ఆస్తులు (Non performing assets) పరిష్కరించడా నికి రుణ రికవరీ ట్రైబ్యునళ్లు, Appelate tribunal ఏర్పాటు చేశారు.

ద్రవ్య సరఫరా:

దేశంలో ద్రవ్య సరఫరాను కొలవడానికి ఆర్‌బీఐ సమష్టి ద్రవ్య వనరుల శీర్షికను ప్రకటించింది. ద్రవ్య సరఫరా నాలుగు రకాల నిర్వచనాలిచ్చి... వాటిని M1, M2, M3, M4గా పేర్కొంది. వీటిలో M1, M3 మాత్రమే వాడుకలో ఉండగా.. M4 ను రద్దు చేసింది. M2 వాడుకలో లేదు. 1991లో M1రూ. 92,892 కోట్లు నుంచి 2006- 07లో రూ.9,65,129 కోట్లకు పెరిగింది. M3 ఇదే కాలంలో రూ.2,65,828 కోట్ల నుంచి రూ.33,10,212 కోట్లకు పెరిగింది. M1 ను సంకుచిత ద్రవ్యమని (Narrow Money), M3ను (Broad Money) విశాల ద్రవ్యమని అంటారు. 2008 ఏప్రిల్ నుంచి M2, M3కు సంబంధించి ద్రవ్య సరఫరాను కొలిచే నిర్వచనంలో ఆర్‌బీఐ మార్పును ప్రకటించింది. సవరించిన M2 = M1 + Time liability portion of saving deposits with banks + బ్యాంకులు ఇష్యూ చేసే సర్టిఫికెట్ ఆఫ్ డిపాజిట్లు + Term deposits maturing within a year. సవరించిన M3 = M1 + Term deposits over one year maturity + call or term borrowings of banks.

ద్రవ్య విధానం :

ద్రవ్య సరఫరా నియంత్రణకు ఆర్‌బీఐ అవలంభించే విధానాన్ని ద్రవ్య విధానం అంటారు. ఆర్‌బీఐ తన ద్రవ్య విధానాన్ని ఏప్రిల్, అక్టోబర్‌లలో ప్రకటిస్తుంది. ఆర్థికాభివృద్ధిని పెంపొందించడం ద్రవ్య విధానం లక్ష్యం. లభ్యమయ్యే అన్ని వనరులను సమర్థంగా వినియోగించుకొని జాతీయాదాయ స్థాయిని పెంపొందించుకోవడానికి ద్రవ్య విధానం ఉపయోగపడుతుంది. రిజర్వు బ్యాంకు ముఖ్యవిధి పరపతి నియంత్రణ. ఇందులో భాగంగా పరిమాణాత్మక, గుణాత్మక లేదా విచక్షణాత్మక పరపతి నియంత్రణపద్ధతులను పాటించి, ఆర్‌బీఐ పరపతిని క్రమబద్ధం చేయగలుగుతుంది. పూర్ణోద్యోగిత సాధించడం, ధరల స్థిరత్వం, ఆర్థికస్థిరత్వం, విదేశీ చెల్లింపుల శేషం అనుకూలంగా ఉండేట్లు చూడటం ఆర్‌బీఐ ద్రవ్య విధాన లక్ష్యాలు. 1982లో ద్రవ్య విధాన అధ్యయనానికి చక్రవర్తి కమిటీని ఆర్‌బీఐ నియమించింది.

పరిమాణాత్మక పరపతి నియంత్రణ :

ఆర్‌బీఐ పరపతి పరిమాణాన్ని నియంత్రించే చర్యలు చేపట్టడమే పరిమాణాత్మక పరపతి నియంత్రణ. ఈ నియంత్రణ చర్యలు మూడు విధాలుగా ఉంటాయి.

1) బ్యాంక్ రేటు (రిజర్వ్ బ్యాంక్ వాణిజ్య బ్యాంకులకిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీ రేటు) 2) బహిరంగ మార్కెట్ చర్యలు (బహిరంగ మార్కెట్‌లో సెక్యూరిటీల అమ్మకం, కొనుగోలు) 3) నగదు నిల్వల నిష్పత్తి (ప్రతి వాణిజ్య బ్యాంకు తన డిపాజిట్లలో కొంత భాగాన్ని ఆర్‌బీఐ వద్ద ఉంచాలి. దీనినే CRR అంటారు). ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణ పరిస్థితులు తలెత్తినప్పుడు ద్రవ్య సరఫరాను తగ్గించే చర్యల్లో భాగంగా ఆర్‌బీఐ బ్యాంక్ రేటును పెంచుతుంది. బహిరంగ మార్కెట్‌లో ప్రభుత్వ సెక్యూరిటీలను అమ్ముతుంది. నగదు-నిల్వల నిష్పత్తి పెంచుతుంది. ప్రతిద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడినపుడు ద్రవ్య సప్లయ్ పెంచే చర్యలో భాగంగా బ్యాంక్ రేటు తగ్గిస్తుంది. మార్కెట్‌లో ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేస్తుంది, CRR తగ్గిస్తుంది.

గుణాత్మక పరపతి నియంత్రణ :

ఆర్థికాభివృద్ధి సాధనలో దేశ శ్రేయస్సు కోసం ముఖ్యమైన ఆర్థిక కార్యకలాపాలకు పరపతి కల్పించి, హానికరమైన వాటికి పరపతి లేకుండా చేయడానికి అవలంభించే విధానాలు, సాధనాలే గుణాత్మక పరపతి సాధనాలు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రణాళికబద్ధ ఆర్థిక ప్రగతిలో భాగంగా గుణాత్మక పరపతి నియంత్రణ ప్రాధాన్యత సంతరించుకుంది.

గుణాత్మక పరపతి నియంత్రణ సాధనాలు :

1)మార్జిన్‌లను నిర్ణయించడం
2) వినియోగదారుని పరపతి నియంత్రణ
3) పరపతి రేషనింగ్
4) ప్రత్యక్ష చర్య
5) ప్రచారం
6) నైతిక ఉద్బోధ

ముగింపు :

ప్రణాళికబద్ధ ఆర్థిక వ్యవస్థలో బ్యాంకుల కార్యకలాపాలు.. ప్రణాళికా లక్ష్యాలు సాధించడానికి అనుగుణంగా ఉండాలి. ప్రణాళికా లక్ష్యాలు సాధించేందుకు వీలుగా వాణిజ్య బ్యాంకులు నిధులు కేటాయించాలి. కీలకమైన రంగాల అభివృద్ధికి ద్రవ్య వనరుల కొరత లేకుండా తోడ్పడాలి. రుణాల ఆవశ్యకతను సరిగా అంచనా వేసి, సమయానికి అందించి, సకాలంలో వసూలు చేసే పర్యవేక్షక సిబ్బందిని తయారు చేయాలి. ప్రైవేట్ బ్యాంకులు స్వల్ప ప్రయోజనాలు, సత్వర లాభాలకు పాల్పడకుండా నియంత్రించే పర్యవేక్షక యంత్రాంగాన్ని ఆర్‌బీఐ పటిష్టంచేయాలి.